ఇప్పుడు నా వంతు

ఇప్పుడు నా వంతు

నెల్లీ, బార్తొలోమ్యు పక్క పక్క ఇళ్లల్లో ఉంటారు.



నెల్లీ బాగా చిన్నగా ఉన్నప్పుడు ఆమెను ప్రతిరోజూ మిసెస్ ప్రింగెల్ కూరగాయల తోట వరకు బార్త్తొలోమ్యు షికారుకి తీసుకుని వెళ్లేవాడు.

నెల్లీ చక్రాల బండిని బార్త్తొలోమ్యు చాలా నిదానంగా తీసుకుని వెళ్లేవాడు. ఆలివర్ ఇంటిముందు వేగ నిరోధకం వచ్చినప్పుడు నెల్లీని బార్త్తొలోమ్యు హెచ్చరించేవాడు: "గట్టిగా పట్టుకో నెల్! ముందు వేగ నిరోధకం ఉంది!"
దానిని దాటగానే నెల్లీ,
"హప్ప్!" అంటూ అరిచేది.

దారిలో ఏదైనా మంచి కుక్క కనిపిస్తే
దానిని ముద్దు చేసేవాళ్లు.

అదే పిచ్చి కుక్క కనిపిస్తే దానిని
బార్తొలోమ్యు తరిమి వేసేవాడు.

మిసెస్ ప్రింగెల్ కూరగాయల తోటలో నీటి గుమ్మటం
నీళ్లను చిమ్ముతూ ఉన్నప్పుడు, "సిద్ధంగా ఉండు.
దూసుకుని వెళదాం, పదా," అంటూ బార్తొలోమ్యు
అరిచేవాడు. నీటి గుమ్మటం కింది నుంచి బండిని
తోస్తున్నప్పుడు, "ఏఁ!" అంటూ నెల్లీ అరిచేది.

నెల్లీ నడవటం నేర్చుకుంటున్నప్పుడు ఆమె చేతిని బార్తొలోమ్యు పట్టుకునేవాడు. “ఉఊ!” అంటూ నెల్లీ చెయ్యి లాగేసుకునేది. ఇతరుల సహాయం ఆమెకి నచ్చేది కాదు.



అందుకని, నిజంగా అవసరమైనప్పుడే బార్తొలోమ్యు తన చేతిని అందించేవాడు.



బార్తొలోమ్యు కూడా పెద్దవాడు అవుతున్నాడు. ఇప్పుడు నడవటానికి అతడు చేతి కర్రను ఉపయోగిస్తున్నాడు. ఇద్దరూ మెల్లగా నడిచేవాళ్లు. మెట్లు ఎక్కేటప్పుడు ఇద్దరూ ఊతకమ్మలు పట్టుకునేవాళ్లు.

ఆ ఇద్దరూ ఎప్పుడూ కలిసే
ఉండేవాళ్లు కాబట్టి వాళ్లని
చుట్టుపక్కలవాళ్లు, “జంట
పక్షులు” అని పిలిచేవాళ్లు.

హాలోవీన్ రాత్రికి ఇద్దరూ
కలిసే విచిత్ర వేషధారణ
వేసేవాళ్లు.

చలి రాత్రులలో అందరూ ఇళ్ల లోపల
ఉంటే వాళ్లు ఇద్దరూ కలిసి బయట
ఆడుకునేవాళ్లు.



ఒక వేసవిలో తన చేతికర్రను గుండ్రంగా తిప్పుతూ
నెల్లీకి స్కేటింగ్ చెయ్యటం బార్తొలోమ్యు నేర్పించాడు.
“అలాగ్గా,” అంటూ ఆమెను హెచ్చరించేవాడు.

ఉన్నట్టుండి అతడి కాలి మీదగా నెల్లీ వెళ్లింది.
అయితే అతడికి కోపం రాలేదు. కాలు
పట్టుకుని ఈల వేశాడు.





తనంతట తాను స్కేటింగ్ చెయ్యటానికి నెల్లీ ప్రయత్నించినప్పుడు...

...ఆమె పడిపోయింది.

ఆమెకు ఏడుపు వస్తోందని బార్తొలోమ్యుకి అర్థమయ్యింది. ఆతడు తోట నుంచి ఒకటి తీసి, “ఏడవ వద్దు చిల్లంగి, ఇదుగో తిను ముల్లంగి!” అన్నాడు.



నెల్లీ నవ్వేసి ముల్లంగి తింది. నిజానికి ఆమెకి ముల్లంగి అంటే అంత ఇష్టం లేదు, కానీ బార్తొలోమ్యు అంటే చాలా ఇష్టం.

కొన్నాళ్లకి నెల్లీ బడికి వెళ్లటం మొదలుపెట్టింది.

బార్తొలోమ్యు ఇంకా ముసలివాడు అయ్యాడు.

అప్పుడప్పుడూ అతడికి సహాయం అవసరం అయ్యేది, కానీ అందుకు అతడు ఇష్టపడేవాడు కాదు.

అందుకని, నిజంగా అవసరమైనప్పుడు మాత్రమే నెల్లీ అతడి చేతిని పట్టుకుంటుంది.

విశ్రాంతి కోసం ఎప్పుడైనా
బార్తొలోమ్యు కూర్చుంటే
చిన్నప్పటి సంగతులు చెప్పమని
నెల్లీ అడిగేది.

ఒక రోజు ఒక కథ చెప్పిన తరవాత,
“మనం చెప్పుకోటానికి కథలు లేని రోజు
వస్తుందా?” అని నెల్లీ అడిగింది.

“అలాంటి రోజు వస్తే మనం మౌనంగా
కూర్చుంటాం. మంచి స్నేహితులు అలా
కూడా ఉంటారు,” బార్తొలోమ్యు
చెప్పాడు.

కొన్నిసార్లు వాళ్లిద్దరూ తీరికగా వరండాలో
కూర్చునే వాళ్లు. బార్తొలోమ్యు తన
మౌత్‌ఆర్గాన్ మీద ఒక పాట
వాయించేవాడు, అది ఏ పాటో నెల్లీ
కనుక్కోటానికి ప్రయత్నించేది.

ఒక రోజు బార్తొలోమ్యు ఒక్కడే ఉన్నప్పుడు మెట్ల మీద నుంచి పడిపోయాడు. ఎర్ర బుగ్గతో కూత పెడుతూ వచ్చిన అంబులెన్స్ అతడిని ఆసుపత్రికి తీసుకుని వెళ్లింది.



అతడు చాలా రోజులు ఆసుపత్రిలో ఉన్నాడు.

అతడికి నెల్లీ ప్రతి రోజూ ఉత్తరం రాసేది. ప్రతి ఉత్తరాన్నీ, “తొందరగా తిరిగి రండి, మనం షికారుకి వెళదాం,” అంటూ ముగించేది.

బార్తొలోమ్యు ఇంటికి తిరిగి వచ్చినప్పుడు అతడు చక్రాల కుర్చీలో ఉన్నాడు. అతడి కళ్లల్లో ఇప్పుడు నవ్వు లేదు. “మనం షికారుకి వెళ్లే రోజులు అయిపోయాయి,” అతడు అన్నాడు.

“అయిపోలేదు,” నెల్లీ చెప్పింది.

“ఇప్పుడు మిమ్మల్ని నేను షికారుకి తీసుకుని వెళతాను.”

ఏం చెయ్యాలో ఆమెకు తెలుసు.

తొందరపడకుండా,

నిదానంగా వెళ్లాలి.

ఆలివర్ ఇంటి ముందు, “సిద్ధంగా
ఉండండి!” అంటూ ఆమె అరిచేది.

వేగ నిరోధకాన్ని దాటగానే బార్తొలోమ్యు
సంతోషంతో తన టోపీ ఊపేవాడు.

దారిలో ఏదైనా మంచి కుక్క కనిపిస్తే దానిని
ముద్దు చేసేవాళ్లు.

అదే పిచ్చి కుక్క కనిపిస్తే దానిని నెల్లీ తరిమి
వేసేది.



ఒక రోజు నీటి గుమ్మటం పని చేస్తుండగా దానిని తప్పించటానికి చుట్టూ తిరిగి వెళదామని నెల్లీ అనుకుంది. కానీ అంతలోనే మనసు మార్చుకుంది. “సరే, బార్తొలోమ్యు. సిద్ధంగా ఉండండి. ఒకటి... రెండు... మూడు... పదండి!” అంటూ చక్రాల కుర్చీని నీటి గుమ్మటం లోంచి తోసింది.

“భలే మజా వచ్చింది!” బార్తొలోమ్యు అన్నాడు. నెల్లీ నవ్వింది. “మీ చక్రాల కుర్చీ తుప్పు పడుతుందేమో.” “పడితే పట్టనీ. ఎవరికి పట్టింది!” అంటూ అతడు నవ్వేశాడు.



“పిల్లల చక్రాల బండిలో నిన్ను బార్తొలోమ్యు నిన్నో, మొన్నో తిప్పినట్టు ఉంది,” అన్నారు మిసెస్ ప్రింగెల్.

“అది నేను చిన్నగా ఉన్నప్పుడు,” నెల్లీ అంది. “బార్తొలోమ్యుని కుర్చీలో కూర్చోబెట్టి షికారుకి తీసుకుని వెళ్లటం ఇప్పుడు నా వంతు.”

బట్టలు ఆరబెట్టుకోటానికి వాళ్లు ఎండలో కూర్చున్నారు. నెల్లీ క్యారెట్ తింటోంది, మౌత్‌ఆర్గా   మీద బార్తొలోమ్యు ఒక పాట వాయిస్తున్నాడు. బార్తొలోమ్యు కళ్లు సంతోషంతో మెరుస్తుండటం నెల్లీ చూసింది.

అయిపోయింది